**చంద్రసింగ్ మణిభాయ్ మరియు ఇతరులు**

**వర్సెస్**

**సుర్జిత్ లాల్ లాధామల్ ఛాబ్డ మరియు ఇతరులు**

**(గౌరవ న్యాయమూర్తులు పతంజలి శాస్త్రి, మెహర్ చాంద్ మహాజన్ మరియు ముఖర్జీయ)**

1951

ఫిబ్రవరి, 23.

బొంబాయి అద్దెలు , హోటల్ మరియు లాడ్జింగ్ హౌస్ రేట్ల నియంత్రణ చట్టం (LVII ఆఫ్ 1947), సెక్షన్: 12, 50- [చట్టం అమలులోకి వచ్చేటప్పటికి పెండింగ్‌లో ఉన్న అప్పీళ్ళకు (ఈ) చట్ట వర్తింపు. — చట్టం యొక్క పూర్వ అన్వయ ప్రభావము యొక్క పరిధి , 12 మరియు 50 సెక్షన్ ల యొక్క అమరిక.

తేదీ 13.02.1947 నాడు అమలులోనికి వచ్చిన బొంబాయి అద్దెలు , హోటల్ మరియు లాడ్జింగ్ హౌస్ ధరల నియంత్రణ చట్టం, (LVII ఆఫ్ 1947), అది అమలులోకి వచ్చిన నాటికి పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లకు వర్తించదు . దీని యొక్క పూర్వ అన్వయ ప్రభావం , ఈ చట్టములోని 50వ సెక్షన్ లో చెప్పబడిన కేసులకు, అంటే ఈ సెక్షన్ లోని నిబంధనల ప్రకారం న్యాయ నిర్ణయ అధికార పరిధి కలిగిన న్యాయస్థానములకు బదిలీ చేయబడిన దావాలు మరియు ఇతర న్యాయ వ్యవహారములకు (ప్రొసీడింగ్స్), మాత్రమే పరిమితము చేయబడినది.

ఈ చట్టంలోని 12వ సెక్షన్ ప్రకారం భవిష్యత్ అన్వయం తప్ప , పూర్వ అన్వయ ప్రభావము లేదు. (2)వ ఉప-విభాగం(సబ్-సెక్షన్) చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత దాఖలైన దావాలకు మాత్రమే సంబంధించి ఉన్నది మరియు (3)వ ఉప విభాగం కూడా అటువంటి దావాలకే వర్తిస్తుంది.

నీల్కాంత్ v. రసిక్ లాల్ (AIR 1949 Bom. 210) ఆమోదించడమైనది.

**సివిల్ అప్పీల్ న్యాయ నిర్ణయ అధికార పరిధి : దావా నెం.174/1945లో , తేదీ.14.10.1947న అహ్మదాబాద్ లో ఉన్న జాయింట్ సివిల్ జడ్జ్ ఇచ్చిన తీర్పును ప్రతివర్తనం చేస్తూ , అప్పీల్**

**నెం. 365/1947లో, తేదీ 01.04.1948న బాంబేలోని హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ ఇచ్చిన తీర్పు మరియు డిక్రీ నుండి ఉత్పన్నమైన అప్పీలు (సివిల్ అప్పీల్ నెం. 57/1950).**

**అప్పీలుదారు తరపున:** బి. సోమయ్య (వారితో పాటు జింద్ర లాల్)

**ప్రతివాదుల తరపున:** CK దఫ్తరీ (వారితో పాటు శ్రీ నారాయణ్ ఆండ్లీ).

**ఈ కోర్టు యొక్క తీర్పు తేదీ 23.02.1951న గౌరవన్యాయమూర్తి మహాజన్ గారిచే ఇవ్వబడినది:**

అహ్మదాబాద్‌లో ఉన్న "భారత భువన్ థియేటర్"గా పిలవబడే ఆస్తికి అప్పీలుదారులు యజమానులు. ఆ థియేటర్‌కు ప్రతివాదులు లీజుదారులు. మరో రెండు సంవత్సరాల పాటు లీజును పునరుద్ధరించదానికి తమకు గల వెసులుబాటును వినియోగించుకుంటున్నట్లుగా, లీజుదారులు మూడు నెలల పూర్వమే వ్రాతపూర్వకమైన నోటీస్ ను, ఆస్తి యజమానులకు ఇచ్చి ఉండనట్లైతే, తేదీ 02.12.1945నాటికి లీజు గడువు ముగుస్తుంది. తేదీ 13.12.1945న అప్పీలుదారులు దాఖలు చేసుకున్న దావా నుండి, ప్రతివాదులను తొలగించడానికి మరియు కొన్ని మొత్తాలను రాబట్టుకోవడానికి ఉద్దేశించిన ప్రస్తుత అప్పీలు, ఉత్పన్నమవుతున్నది. ఈ క్రింద చెప్పబడిన నిర్దేశనలతో, తేదీ 14.10.1947న ఈ దావా డిక్రీ చేయబడినది:

(1) లీజులో ఉన్న నిబంధనల ప్రకారం లీజు పునరుద్ధరణ గురించిన వెసులుబాటును, ప్రతివాదులు వినియోగించలేదనియు, (2) వారు లీజు నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినారనియు, మరియు (3) వారు అద్దె పరిమితి చట్టం ద్వారా రక్షించబడుట లేదనియు. మధ్యకాలీన-ఆదాయము గురించిన విచారణకు ఆదేశించబడ మైనది. జాయింట్ సివిల్ జడ్జి యొక్క డిక్రీకి వ్యతిరేకంగా హైకోర్టు ముందు ప్రతివాదులు తేదీ 10-11-1947 న అప్పీలు దాఖలు చేసుకున్నారు. తేదీ 26.02.1948న, ఈ

అప్పీల్‌ను హైకోర్టు బెంచ్ ( న్యాయమూర్తులు వెస్టన్ మరియు దీక్షిత్ )లు విచారించడము మరియు తేదీ01.04.1948న దీనిని నిర్ధారించడము జరిగినది. జాయింట్ సివిల్ జడ్జి ఇచ్చిన తీర్పు మరియు డిక్రీలను ప్రతివర్తనం చేస్తూ, వాది యొక్క దావాను కొట్టివేయడము జరిగినది. లీజులోని 4(2) అంశం ప్రకారం అవసరమైన విధముగా , లీజు యొక్క పునరుద్ధరణ గురించి మూడు నెలల ముందుగానే లిఖితపూర్వక నోటీస్ ను అప్పీలుదారులకు ఇచ్చినట్లుగా , ప్రతివాదులు రుజువు చేయలేదంటూ , మొదటి అంశంపై విచారణ కోర్టు ఇచ్చిన నిర్దేశాన్ని అంగీకరిస్తూ, దానిని హై కోర్టు దృవపరచడము జరిగినది. ఈ కోర్టు, లీజులోని 2(20) నిబంధనను ప్రతివాదులు ఉల్లంఘించినారన్న విషయముగా , విచారణ కోర్టు ఇచ్చిన నిర్దేశనను ప్రతివర్తనం చేసినది. అప్పీలు చేయబడిన డిక్రీ , అది చేయబడిన నాటికి సరైనదే అయి ఉన్నప్పటికి చట్టము LVII, 1947 అమలులోకి రావడం దృష్ట్యా , మార్పు చెందిన పరిస్తితుల వలన , అప్పీలుదారులు దావా ఆవరణను స్వాధీనపరచుకోవడానికి అర్హులు కారన్న నిర్ణయానికి , ఈ కోర్టు చివరకు రావడం జరిగినది. హై కోర్టు యొక్క తీర్పు వలన వ్యధితులైన అప్పీలుదారులు , దృవపత్రాన్ని పొంది తేదీ 07.03.1949న , ఈ కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు మరియు అది ప్రస్తుతము నిర్ణయము కోసము మా ముందు ఉన్నది.

అప్పీలు తిరిగి వినడమనే ప్రక్రియలో ఉన్నందున , అది తేదీ. 13.02.1948న అమలులోనికి వచ్చిన చట్టము LVII/1947 ప్రకారమే నిర్ణయించబడాలే కానీ , విచారణ కోర్టు (దావా) డిక్రీ చేసే సమయములో అమలులో ఉన్న నిర్దేశాల ప్రకారం కాదు అని హై కోర్టు ముందు వాదించడము జరిగినది. మరో మాటలో చెప్పాలంటే, విచారణ చేసిన న్యాయమూర్తి(దావా) డిక్రీ చేసిన తరువాత మరియు అప్పీలు వినడానికి ముందు , చట్టములో మార్పు జరగడము వలన , కక్షిదారుల యొక్క హక్కులను అప్పీలు వినే

నాటికి ఉన్న చట్టము ప్రకారము మాత్రమే నిర్ణయించాలన్నది ఈ వాదన. ఈ వాదనకు ప్రభావము కల్పిస్తూ, ప్రతివాదులను తొలగించాలని చేసిన డిక్రీ ని హై కోర్టు త్రోసిపుచ్చడము జరిగినది.

ఈ క్రింద చెప్పబడిన మూడు కారణాలతో , హై కోర్టు యొక్క నిర్ణయాన్ని అప్పీలుదారుని తరపున న్యాయవాది సవాలు చేసినారు: (1) ఒకవేళ LVII/1947 చట్టం లోని నిబంధనల ప్రకారమే అప్పీల్‌ను నిర్ణయించాలని హైకోర్టు భావించినప్పటికీ, ఈ చట్ట పరిధి నుండి మినహాయించబడిన, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లకు, ఈ చట్టములోని నిర్ధేశాలు వర్తించవు: (2) బాంబే చట్టం III/1949 ద్వారా చట్టం LVII/1947లో సవరించబడియున్నది మరియు ఆ సవరించబడిన చట్ట నిర్దేశనల ప్రకారం , ఈ కోర్టు ముందు పెండింగ్ లో ఉన్న అప్పీళ్లను చట్టం LVII/1947 నుండి మినహాయింపు ఇస్తున్న, సవరించిన చట్టము ప్రకారమే నిర్ణయించాల్సి ఉంటుంది ; మరియు లీజు లోని 2 (20)లోని నిబంధనలను ప్రతివాదులు ఉల్లంఘించార న్న, విచారణ కోర్టు యొక్క నిర్ధేశాన్ని హైకోర్టు పొరపాటుగా ప్రతివర్తన చేసినది. అప్పీలుదారుడి తరపున చేయబడిన ఈ వాదనలను వ్యతిరేకించడముతో పాటు , ప్రతివాదులు తాము లీజు నిబంధనల ప్రకారం , దాని పునరుద్ధరణ కోసము ఉన్న వెసులుబాటును వినియోగించుకున్నామని రుజువు చేసుకోలేదని , నిర్ధారణకు రావడములో రెండు కోర్టులు పొరబడినాయని, ప్రతివాదుల తరపున న్యాయవాది వాదించినారు.

మా అభిప్రాయం ప్రకారం, ఈ అప్పీల్ ను నిర్ణయించడమనేది చట్టము LVII /1947 లోని 12 మరియు 50 సెక్షన్ల యొక్క నిర్మాణంపైననే ఆధారపడి ఉంటుంది. తేదీ 19.01.1948న చేయబడిన మరియు తేదీ 13.02.1948న అమలులోనికి వచ్చిన , బొంబాయి అద్దెలు, హోటల్ మరియు లాడ్జింగ్ హౌస్ రేట్ల నియంత్రణ చట్టం, LVII/1947, పెండింగ్ లో ఉన్న అప్పీళ్లకు వర్తిస్తుందా, లేక దాని పూర్వ అన్వయ ప్రభావం, ఆ చట్టములోని 50వ సెక్షన్ లో చెప్పబడిన కేసులకు మాత్రమే పరిమితమై ఉన్నదా ,

అనేది ఇక్కడ నిర్ణయించబడాల్సిన అంశమై ఉన్నది. లీజు యొక్క పునరుద్ధరణను గురించిన వెసులుబాటును, లీజు ఒడంబడికల ప్రకారమే వినియోగించడం జరిగినదా అన్న విషయము , వాస్తవాల గురించిన ఏక నిర్ణయం ద్వారా నిశ్చయము చేయబడినది మరియు శ్రీ దఫ్తరీ తన వాదనలను బలపరుస్తూ చెప్పినవి ఏవియు కూడా ఈ నిర్ధారణను బలహీనపర్చదు. అందువల్ల, ప్రతివాదులు లీజు లో తమకు ఇవ్వబడిన పునరుద్ధరణ గురించిన వెసులుబాటును విని యోగించుకోలేదు అన్న భావనతోనే ఈ కేసు నిర్ణయించబడాల్సి ఉంటుంది. ప్రతివాదులు లీజు యొక్క షరతులను ఉల్లంఘిచినారని , విచారణ కోర్టు ఇచ్చిన నిర్దేశాన్ని హై కోర్టు తప్పుగా పరివర్తనం చేసిందన్న అప్పీలుదారుడి యొక్క న్యాయవాది వాదనలతో, మేము ప్రభావితం కావడము లేదు. కానీ ఈ నిర్ధేశాన్ని పరివర్తనము చేయడానికి హై కోర్టు చూపిన అన్ని కారణాలతోనూ మేము ఏకీభవించడములేదు.

చట్టము LVII/1947 లోని నిబంధనలు, ఆ చట్టం అమల్లోకి వచ్చే సమయానికి పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లకు వర్తిస్తాయి అని అనడములో హై కోర్టు సరియైన నిర్ధారణకు వచ్చినదా ; ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి చట్టం LVII/1947 లోని 12 మరియు 50 సెక్షన్ల నిర్మాణంపై ఆధారం ఉంచవలసి ఉంటుంది. ఈ చట్టంలోని 12 సెక్షన్ ఈ క్రింది విధముగా ఉన్నది:-

"(1) అద్దెకు ఉన్న వ్యక్తి ప్రామాణిక అద్దె మరియు అనుమతించబడిన పెంపుదలలు ఏమైనా ఉంటే (వానిని) చెల్లించినంత వరకు, లేక చెల్లించడానికి సిద్ధంగాను ఒప్పుదలతోనూ ఉన్నంత వరకు , మరియు ఈ చట్ట నిర్దేశాలకు అనుగుణముగా ఉన్న , లీజు లోని ఇతర నిబంధనలన్నిటిని పాటిస్తూ మరియు నిర్వర్తిసున్నంత వరకూ , యజమాని (ఆస్తిని) ఆవరణను తిరిగి స్వాధీన పరచుకోవడానికి అర్హుడై ఉండడు.

(2) ప్రామాణిక అద్దె లేక అనుమతించబడిన పెంపుదల చెల్లించలేదన్న కారణముతో, ప్రామాణిక అద్దె లేక అనుమతించబడిన పెంపుదలలను గురించి డిమాండ్

చేస్తూ, ఆస్తి బదిలీ చట్టం , 1882లోని 106వ సెక్షన్ లో చెప్పబడిన విధముగా , వ్రాత పూర్వకముగా ఇచ్చిన నోటిసు అద్దెకు ఉన్న వ్యక్తికి అందిన నాటి నుండి ఒక నెల పూర్తి అయ్యే వరకు , యజమాని స్వాధీనము తిరిగి పొందడము కోసము దావాను దాఖలు చేయడానికి వీలులేదు.

(3) అటువంటి దావా విచారణ సమయములో , అద్దెకు ఉన్న వ్యక్తి బాకీ ఉన్న ప్రామాణిక అద్దె లేక అంగీకరించబడిన పెంపుదలలను, దావా ఖర్చులతో సహా చెల్లించినా లేక చెల్లింప చూపినా , (ఆవరణ నుండి ) తొలగింపు కోసము దావాను డిక్రీ చేయడానికి వీలులేదు.

**వివరణ:-** ఈ చట్టం ప్రకారం రికవరీ చేయదగిన ప్రామాణిక అద్దె లేదా అనుమతించబడిన పెంపుదలకు సంబంధించి ఏదైనా వివాదం ఉన్నట్లయితే , మరియు అద్దెకు ఉన్న వ్యక్తి 11వ సెక్షన్ క్రింద దరఖాస్తును దాఖలు చేసుకుని , కోర్టు ఉత్తర్వుల ప్రకారము ప్రామాణిక అద్దెను లేక అంగీకరించబడిన పెంపుదలను చెల్లించినా లేక చెల్లింప చూసినా , సబ్-సెక్షన్ ( 2)లో సూచించిన నోటీసు యొక్క ఒక నెల గడువు ముగిసేలోపు అతడు అటువంటి మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ను మరియు ఒప్పుదలతో ఉన్నట్లుగా భావించవలసి ఉంటుంది".

ఇది అద్దెకు ఉన్న వ్యక్తిని తొలగింపు నుండి రక్షణ కలిగించే ఒక దృఢమైన నిర్దేశన (సెక్షన్) ము అయి ఉన్నది. మిగిలిపోయిన అంశాలతో వ్యవహరించే రద్దు సెక్షన్ అయిన 50వ సెక్షన్, IVవ విభాగములోనికి వస్తున్నది. ఇది 1939వ చట్టం మరియు 1944వ చట్టములను రద్దు చేస్తున్నది మరియు చట్టములను రద్దు చేస్తున్నప్పుడు ఈ క్రింది విధంగా నిర్దేశిస్తున్నది:

" అద్దెల వసూలు లేక నిర్ధారణ లేక ఆవరణ స్వాధీనము లను గురించి యజమాని మరియు అద్దెకు ఉన్న వ్యక్తికి మధ్య ఉన్న IIవ విభాగములోని నిర్దేశనములు వర్తించే అన్ని దావాలు మరియు ప్రొసీడింగ్ లు (అమలు ప్రొసీడింగ్స్ అమలు అప్పీల్ లు కాకుండా) మరియు IIIవ విభాగము వర్తించే, ప్రదేశాలలో ఉన్న , హోటల్ మేనేజర్ లేక వసతి గృహము యొక్క యజమాని , వసతి పొందిన వ్యక్తి నుంచి రుసుము వసూలు కోసము లేక హోటల్ లో కానీ , వసతి గృహములో కానీ (అతనికి ఇచ్చిన)

వసతి సౌకర్యాలను తిరిగి స్వాధీనపరచుకోవడము కోసము దాఖలు చేసిన అన్ని దావాలు మరియు ప్రొసీడింగ్‌లు ఏమైనా కోర్టులో పెండింగ్ లో ఉన్నట్లైతే , అవి ఈ చట్టము క్రింద విచారణ చేయడానికి న్యాయ విచారణాధికార పరిధిని కలిగి ఉన్న న్యాయ స్థానములకు బదిలీ చేయబడి , అందులోనే కొనసాగించబడవలెను: మరియు ఆ తరువాత అటువంటి దావాలకు మరియు ప్రొసెడింగులకు ఈ చట్టములోని అన్ని నిర్దేశనములు మరియు వాని క్రింద చేయబడిన సూత్రములు వర్తింపచేయబడవలయును.

ఇంకా నిర్దేశించినదేమంటే :

(ఎ) బొంబాయి అద్దెలు, హోటల్ ధరలు మరియు లాడ్జింగ్ హౌస్ రేట్లు (నియంత్రణ) చట్టం, 1944లోని IVవ విభాగము కింద నియంత్రణాధికారులు ఇచ్చిన ప్రతి ఉత్తర్వు లేదా తీసుకున్న ప్రతీ చర్య మరియు ఆ విభాగము క్రింద ఇవ్వబడినట్లుగా భావించబడే ప్రతీ ఉత్తర్వు లేక చేయబడినట్లుగా భావించబడే ప్రతీ చర్య, ఆ విభాగము క్రింద ఇవ్వబడినట్లుగానే భావించబడవలెను; మరియు

(బి) ఆ చట్టం యొక్క IV వ విభాగము క్రింద ఉన్న నియంత్రణాధికారుల ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రొసీడింగ్‌లు , ఈ చట్టం కింద నియామకము చేయబడిన నియంత్రణాధికారులకు బదిలీ చేయబ డి, వారి ముందే దాఖలు చేయబడిన న్యాయ వ్యవహారములను (ప్రొసీడింగ్‌లను), వలెనే అవి కొనసాగించబడవలెను"

50వ సెక్షన్ , కేవలం పెండింగ్‌లో ఉన్న దావాలు మరియు న్యాయ వ్యవహారములను (ప్రొసీడింగ్‌లను), ఈ చట్టము క్రింద న్యాయ నిర్ణయాధికార పరిధి ఇవ్వబడిన, న్యాయ స్థానములకు బదిలీ చేయడాన్ని మాత్రమే నిర్దేశిస్తున్నదనియు, అమలు వ్యవహారములను (execution proceedings) ఒక న్యాయస్థానము నుండి మరొక దానికి బదిలీ చేసే ప్రశ్న ఉత్పన్నము కానందున , వానిని దాని(సెక్షన్ 50) పరిధి నుండి మినహాయించడం జరిగినదనియు , మరియు అప్పీలు అనేది దావా యొక్క కొనసాగింపు అయి ఉండడం వలనను మరియు తిరిగి వినడమనేది దాని తత్వము అయి ఉండడం వలనను , 12వ

సెక్షన్ లోని నిర్దేశనములను పెండింగ్ లో ఉన్న అప్పీళ్ళకు వర్తింపజేయవల్సి ఉంటుదనియు, హై కోర్టు నిర్ధారించడమైనది.

నీల్‌కాంత్ వర్సెస్ రసిక్‌లాల్ (AIR 1949 బాంబె 210 )కేసులో, ఈ చట్టములోని 12 మరియు 50వ సెక్షన్ ల నిర్మాణం గురించి డివిజన్ బెంచ్ వెలిబుచ్చిన అభిప్రాయమును ప్రశ్నించడము మరియు ఈ విషయాన్ని ఫుల్ బెంచ్ యొక్క అభిప్రాయము కోసం పంపడము జరిగినది. కొత్త చట్టములోని నిర్దేశనములు మరియు వాని క్రింద తయారుచేయబడిన సూత్రములను , 50వ సెక్షన్ క్రింద బదిలీ చేయబడిన దావాలకు మరియు చట్ట వ్యవహారములకు మాత్రమే వర్తింప చేయవలసి ఉంటుందనియు , మరియు పూర్వ అన్వయ ప్రభావము అనేది కేవలము ఈ సెక్షన్ లో చెప్పబడిన విధముగా మాత్రమే ఉంటుందనియు, అభిప్రాయం వెలిబుచ్చుతూ , 50 వ సెక్షన్ యొక్క నిర్మాణము గురించి డివిజన్ బెంచ్ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని, ఫుల్ బెంచ్ త్రోసిపుచ్చడమైనది. ఫుల్ బెంచ్ వ్యక్తం చేసిన అభిప్రాయంతో మేము వినయపూర్వకముగా ఏకీభవిస్తున్నాము. 12 మరియు 50వ సెక్షన్ లను పరిశీలించినప్పుడు , వీనిలో వినియోగించిన భాష ప్రకారము , ఈ చట్టము యొక్క పూర్వ అన్వయ ప్రక్రియ అనేది , చాలా పరిమితము చేయబడిందనియు , మరియు అమలు వ్యవహారములను ( execution proceedings) మరియు అప్పీళ్లను దీని ప్రభావము నుండి మినహాయించడము జరిగిందనియు , మరియు వానికి , డిక్రీ చేసే నాటికి అమలులో ఉన్న చట్ట నిర్దేశనములను మాత్రమే వర్తింప చేయవలసి ఉంటుదనియు , స్పష్టం అవుతున్నది. "మరియు దాని మీదట ఆ విధమైన అన్ని దావాలకు మరియు చట్ట వ్యవహారములకు , ఈ చట్టములోని అన్ని నిర్దేశనములు మరియు వాని క్రింద చేయబడిన సూత్రములు వర్తింప చేయబడవలయును", అనే 50వ సెక్షన్ లోని ముగింపు పదాలు , దీని (ఈ సెక్షన్) యొక్క పూర్తి నిర్మాణాన్ని తెలియజేస్తున్నవి. ఈ చట్టము క్రింద న్యాయ నిర్ణయాధికార పరిధి ఇవ్వబడిన ,

న్యాయస్థానములకు పెండింగ్ కేసులను , వాని విచారణార్ధం బదిలీ చేయడము మాత్రమే , 50వ సెక్షన్ యొక్క ప్రధాన లక్ష్యం అనియు, మరియు ఈ చట్టము యొక్క పూర్వ అన్వయ ప్రక్రియ పరిధి గురించి ఈ సెక్షన్ కు ఏ మాత్రము సంబంధము లేదనియు , మరియు అద్దెకు ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించుచున్న, ఈ చట్టములోని 12వ సెక్షన్ , పూర్వ అన్వయ ప్రభావము కలిగినదని భావించవలసి ఉంటుదనియు , న్యాయవాది శ్రీ డ ఫ్తరీ వాదిం చినారు. మా అభిప్రాయము ప్రకారము ఈ వాదన సరైయినది కాదు. కేవలము న్యాయ నిర్ణయాధికార పరిధి కలిగిన న్యాయస్థానములకు మాత్రమే కేసులను బదిలీ చేయడానికి నిర్ధేశించినదిగా, 50వ సెక్షన్ ను అభివర్ణించలేము. అదియునూ కాక , ఇది కొత్త చట్టంలో ఒక "రద్దు" సెక్షన్ గా ఉన్నది. ఇది ముందు ఉన్న రెండు శాసనములను రద్దు పరుస్తూ ఉన్నది, మరియు ఆ విధముగా వానిని రద్దు పరిచేటప్పుడు , "అమలులు మరియు అప్పీల్‌లను" ఈ రద్దు ప్రభావితం చేయదనియు మరియు 28వ సెక్షన్ క్రింద , విచారణాధికార పరిధి కలిగిన న్యాయస్థానములకు బదిలీ చేయబడిన , పెండింగ్‌లో ఉన్న అన్ని దావాలకు , ఈ చట్టము యొక్క నిర్ధేశనములు వర్తింప చేయవలెననియు ఇది (సెక్షన్-50) నిర్ధేశిస్తున్నది. 12వ సెక్షన్, భవిష్యత్ అన్వయ రూపము కలిగి ఉన్నదే కానీ, పూర్వ అన్వయ రూపము కాదన్న ఫుల్ బెంచ్ యొక్క అభిప్రాయముతో ఏకీభవించడానికే మేము మొగ్గు చూపుతున్నాము. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత , దాఖలు చేయబడిన దావాలకు మాత్రమే (2)వ ఉప సెక్షన్ సంబంధము కలిగి ఉన్నదని స్పష్టమవుతున్నది. ఈ చట్టాన్ని శాసనగ్రంధస్థముగా చేసినప్పటికే పెండింగ్ లో ఉన్న దావాలకు , దీనిని వర్తింప చేయకూడదు. అద్దెకు ఉన్న వ్యక్తికి , దావా విచారణ సమయములో అద్దెను చెల్లించడానికి లేదా చెల్లింపచూడడానికి హక్కును కల్పిస్తున్న (3)వ ఉప-సెక్షన్ , ఈ చట్టము అమలులోనికి వచ్చిన తరువాత దాఖలు చేసిన దావాలకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే ఇందులో “ఆ విధమైన దావా”(in such suit) అని చెప్పబడియున్నది కానీ “ఏ దావాలో అయినా ( in

any suit)" అని చెప్పబడలేదు. "ఆ విధమైన దావా ( in such suit)" అంటే సెక్షన్ 12 యొక్క 2 మరియు 3వ ఉప–సెక్షన్ లలో చెప్పబడిన దావా మాత్రమే అయి ఉండాలి.

ఈ కేసులోని అప్పీలునకు LVII/1947చట్టము యొక్క నిర్దేశనములను వర్తింపచేయడములో, హైకోర్టు పొరబడినదనియు , ఆ పొరపాటు మీద ఆధారపడి అప్పీలును ఆమోదించడములో తప్పు చేసినదనియు, ఇందు (పై చర్చల) ఫలితముగా మేము భావిస్తున్నాము. ఈ భావన దృష్ట్యా, ఈ అప్పీలును చట్టం III/1949లోని నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించాలని, అప్పీలుదారుడి యొక్క గౌరవ న్యాయవాది చేసిన ప్రత్యామ్నాయ వాదనతో వ్యవహరించనవసరం లేదు. తదనుగుణంగా, వాది యొక్క దావాను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన డిక్రీని త్రోసిపుచ్చుతూ, వాది దావాను ఖర్చులతో సహా డిక్రీ చేస్తూ విచారణ కోర్టు ఇచ్చిన డిక్రీ ని, పునరుద్ధరించడమైనది.

అప్పీల్ ఆమోదించబడినది.

అప్పీలుదారులకు ఏజెంట్: నౌనిత్ లాల్.

ప్రతివాదులకు ఏజెంట్: రాజిందర్ నారాయణ్.